ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల జిల్లా వార్తలు 5

బుధవారం 28 ఫిబ్రవరి 2024



చెరువులపై చిన్నచూపు!

- ప్రతిపాదనలకే పరిమితమైన మరమ్మతులు
- అభివృద్ధికి నిధుల ఊసే లేదు
- 15ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని దద్దనాల గేట్లు
- 10 అడుగులకు చేరిన పూడిక

బనగానపల్లె, ఫిబ్రవరి 27:

నీటిపారుదల రంగంలో చెరువులకు చాలా ప్రాధాన్యత ఉంది. ఊరూరికి ఉండే చెరువుల కింద పంటసాగుతోపాటు గ్రామాల అవసరాలు ఎన్నో తీరుతుంటాయి. అయితే వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల వలెనే చెరువులనూ నిర్లక్ష్యం చేసింది. బనగానపల్లె నియోజకవర్గంలోని చెరువులకు ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విదిల్చిన దాఖలాలు లేవనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలోని చెరువులు శిథిలావస్థకు చేరుకున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని ఒకే ఒక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు దద్దనాల ప్రాజెక్టు. దీని పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. ప్రభుత్వానికి మైనర్ ఇరిగేషన్ అధికారులు నివేదికలు పంపడమేగాని నిధులు విడుదల కావడం లేదు.



పంట కాల్వల్లో ముళ్లకంపలు, జమ్ము

దద్దనాల ప్రాజెక్టు

బనగానపల్లె నియోజకవర్గంలోని ఒకే ఒక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు దద్దనాల ప్రాజెక్టు. బనగానపల్లె మండలంలోని పాతపాడు గ్రామం వద్ద నిర్మించిన ఈ ప్రాపాజెక్టు కింద ప్రత్యక్షంగా 1516 ఎకరాలకు, పరోక్షంగా పదివేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. 15 గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందుతోంది. గతంలో ప్రాజెక్టులోకి నీరురాక ఒట్టిపోయింది. 15 ఏళ్లగా ప్రధాన గేట్లు, పూడిక గేట్లు మరమత్తులకు నోచుకోలేదు. అయితే ఇందులో ఓ గేటుకు మరమత్తు చేశారు. ప్రాజెక్టు మరో ప్రధాన గేటు ఒకటి, ప్రాజెక్టుకు సంబంధించి రెండు పూడిక గేట్లు, పంటపొలాలకు నీరు వదిలే స్లూయిస్ గేట్లు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అయితే ప్రాజెక్టుకు ఉన్న రెండు ప్రధాన గేట్లలో ఓ గేటు మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

15 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని దద్దనాల ప్రధాన గేట్లు



పని చేయని గేటు

దద్దనాల ప్రాజెక్టులోని ఒక ప్రధాన గేటు, పూడిక గేట్లు, పంట పొలాలకు నీరు అందించే స్లూయిస్ గేట్లు 15 ఏళ్ళగా పూర్తిగా పనిచేయడం లేదు. నాలుగేళ్ల క్రితం ఒక గేటుకు మాత్రమే మరమ్మతు చేశారు. ఒక గేటుకు నేటికీ చేయలేదు. అలాగే పూడికగేట్లు, స్లూయిస్ గేట్లు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. ప్రాజెక్టులో 25 అడుగుల వరకు నీరు ఉండాలి. కానీ పనులు చేయకోవడంతో 10 అడుగులకు పైగా పూడికతో నిండిపోయింది. ప్రాజెక్టు పంటకాల్వలు దెబ్బతిన్నాయి. పంట కాల్వలు ముళ్ల కంపలతో నిండిపోయాయి. కనీసం పంటలు పండించుకుందామన్నా పంటకాల్వలు లేక రైతులు బోర్లు వేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు.



ముళ్ల కంపలు, జమ్ముతో నిండిన పంటకాల్వలు

ప్రాజెక్టు పరిధిలో 1516 ఎకరాలకు పంటకాల్వలు లేవు. పంట కాల్వలు శిథిలమయ్యాయి. పంటకాల్వలు ముళ్ల కంపలతో నిండిపోయాయి. జమ్ము కూడా పేరుకుపోయింది. . మైనర్ ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు, ఇతర పంట కాలువల మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రాజెక్టు పూర్తి శిథిలావస్థకు చేరుకుంది.


35.10 కోట్లతో చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు

బనగానపల్లె నియోజకవర్గంలో చెరువులకు మైనర్ ఇరిగేషన్ అధికారులు రూ. 35.10 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. బనగానపల్లె దద్దనాల ప్రాజెక్టుకు సంబంధించి గేట్లు, పూడికగేట్లు, ప్లాట్‌పాం, కాల్వల నిర్మాణం, లైనింగ్, జనరేటర్ తదితర పనులకు రూ. 14.12 కోట్లు, కుక్కలగంటి చెరువుకు రూ.2.80 కోట్లు, రాళ్లకొత్తూరు ఊరకుంట చెరువుకు రూ.40 లక్షలు, సంజామల మండలం ముక్కమళ్ల చెరువుకు రూ.7.50 కోట్లు, హోత్రమాన్‌దిన్నె చెరువుకు రూ. 2.40 కోట్లు, రామభద్రుని పల్లె చెరువుకు రూ.20లక్షలు, కానాల చెరువుకు రూ. 6 కోట్లు, అవుకు మండలం వేములపాడు చెరువుకు రూ 20లక్షలు, మంగంపేట ఊట చెరువుకు రూ.59 లక్షలు, మంగంపేట తండా ఊట చెరువుకు 69లక్షలు, మెట్టుపల్లె చెరువుకు కూ.20లక్షలతో అధికారులు నాలుగేళ్ల క్రితం ప్రతిపాదనలు పంపారు. కాని ఒక్క చెరువుకు ఒక్క నయాపైసా విడుదల కాలేదు.

బనగానపల్లె నియోజకవర్గంలోని 5 మండలాల్లో 20 వరకు ప్రధాన చెరువులు ఉన్నాయి. అలాగే ఊరకుంట చెరువులు ఉన్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలో బనగానపల్లె మండలంలో ప్రధానంగా చెరువుపల్లె అక్కాజమ్మ చెరువు, చెర్కోకొత్తూరులో కుక్కలగంటి చెరువు, తమ్మడపల్లె చెరువు, పసుపల చెరువు, బత్తులూరుపాడులో రాచెరువు, కైప చెరువు, రామతీర్థం చెరువు, అవుకు మండలంలో వేముల పాడు చెరువు, ఉప్పలపాడు చెరువు, కునుకుంట్ల చెరువు, మెట్టుపల్లె చెరువు, సంజామల మండలంలో కానాల చెరువు, రామభద్రునిపల్లె చెరువు, ముక్కమళ్ల చెరువు, నొస్సంచెరువు, కొలిమిగుండ్ల మండలంలో తిమ్మనాయునిపేట చెరువు, నాయునిపల్లె సద్దల వెంగన్న చెరువు, హనుమంతుగుండం చెరువు, అబ్దుల్లాపురం దయ్యాల చెరువులతో చిన్న చిన్న చెరువులు ఎన్నో ఉన్నాయి. ఈ చెరువులకు గత 5 ఏళ్లగా కనీస మరమ్మతు పనులు చేయలేదు. ఏండ్ల తరబడి మరమ్మతులు లేకపోవడంతో పూర్తిస్థాయిలో చెరువులు నిండటం లేదు. రైతులకు సాగునీరు అందడం లేదు.


మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్న చెరువుల్లో పూడిక పేరుకుపోయింది. కాలువల్లో ముళ్ల కంపలు పెరిగిపోయాయి. తూములు తుప్పు పట్టి పనిచేయడం లేదు. కనీస మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో చెరువులు ఉండీ ప్రయోజనం లేకుండాపోయిందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంపింగ్ చేయని అధికారులు



ఎస్సార్బీసీ నీటిని పంపింగ్ చేయకపోవడంతో చెరువులో కనిపిస్తున్న పూడిక

బీసీ జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో దద్దనాల ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకం పూర్తి చేశారు. ఎస్సార్బీసీ నీటిని దద్దనాల ప్రాజెక్టుకు మళ్లించే పనులు పూర్తి చేశారు. 21.01 కోట్ల నిధులు మంజూరు చేయించి బనగానపల్లె పట్టణంలో పంప్ హౌస్‌లు ఏర్పాటు చేసి ఈ ఎత్తిపోతల పథకాన్ని మైనర్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ అధికారులకు అప్పగించారు. అయితే ఎస్సార్బీసీలో నీరు పారినా ప్రాజెక్టుకు నీటిని పంపింగ్ చేయడం లేదు. కేవలం నామ్‌కేవాస్తేగా అధికారులు పంపింగ్ చేసి తమకు అన్యాయం చేస్తున్నారని ఈ ప్రాంత రైతులు ఆక్రోశిస్తున్నారు. విద్యుత్ బిల్లులు అధికంగా వస్తాయనే నెపంతో పంపింగ్ చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎస్సార్బీసీ పారుతున్నా పంపింగ్ చేయకపోవడం వల్ల దద్దనాల ప్రాజెక్టులో నీరు అడుగంటి పోతోంది. దీంతో బోరుబావుల్లో నీరు తగ్గిపోయింది. ఆయకట్టు కింద పంటలకు సమయానికి నీరు అందక ఎండిపోయాయి.



పాతపాడు వద్ద నిర్మించబడ్డ దద్దనాల ప్రాజెక్టు

ప్రశాంతంగా టెట్ ప్రారంభం

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 27: ఉపాధ్యాయ అర్హత ప్రవేశ పరీక్ష (టెట్) మంగళవారం నుంచి ప్రాంభమయ్యాయి. నంద్యాల జిల్లా కేంద్రంలో 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల, ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల, రామకృష్ణా డిగ్రీ, పీజీ కళాశాలల్లో అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షకు మొత్తం 4 కేంద్రాల్లో 563 అభ్యర్థులకు గాను 520 మంది హాజరు కాగా, 43మంది గైర్హాజరైనట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో 580 మంది అభ్యర్థులకు గాను 526 మంది హాజరు కాగా 54 మంది గైర్హాజరయ్యారన్నారు.



పరీక్ష కేంద్రం వద్ద నెంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు





జవహర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో పెద్దిరాజు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

శ్రీశైలం, ఫిబ్రవరి 27: శ్రీశైలం మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను దేవస్థానం వైభవంగా నిర్వహించనుంది. మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. జవహర్‌రెడ్డిని, దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణను ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీరికి స్వామివార్ల శేషవస్త్రం, ప్రసాదాన్ని అందజేశారు.

ఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఐజీ

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేయాలి
- డీఐజీ సీహెచ్ విజయరావు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 27 : నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయాన్ని మంగళవారం కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు తనిఖీ చేశారు. డీఐజీ ఎస్పీ కార్యాలయానికి చేరుకోగానే ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి పుష్పగుచ్ఛంతో ఆయనకు స్వాగతం పలికారు. జిల్లాలోని పోలీసు అధికారులందరినీ డీఐజీకి ఎస్పీ పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఏఆర్ సిబ్బంది నుంచి డీఐజీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం డీఐజీ నూతనంగా నిర్మిస్తున్న పోలీసు భవన సముదాయం, ఏఆర్ కార్యాలయాన్ని పరిశీలించారు. డీపీవోలోని అన్ని విభాగాల పనితీరు, డీసీఆర్‌బీ, స్పెషల్‌బ్రాంచ్, ఏఆర్ విభాగాల పనితీరుపై ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నంద్యాల జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలతో డీఐజీ ఎస్పీతో కలిసి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ విజయరావు మాట్లాడుతూ పోలీసు శాఖలోని అందరూ టీమ్‌గా పనిచేస్తూ సార్వత్రిక ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే స్పందించాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బార్డర్ చెక్‌పోస్టుల వద్ద మద్యం, డబ్బు అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్స్, మర్డర్ కేసుల ముద్దాయిల అరెస్టు పెండింగ్‌లపై ఆరా తీశారు. అలాగే ఆయుధాల లైసెన్స్‌ల డిపాజిట్లు, రౌడీషీటర్స్, ట్రబుల్ మాంగర్స్, సమస్యాత్మక గ్రామాల పరిస్థితులపై వాకబు చేశారు. ఎన్నికల్లో సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. గతంలో జిల్లాలో జరిగిన ముఖ్యమైన, సంచలనాత్మకమైన నేరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను అధికశాతం తగ్గించామని పేర్కొన్నారు. కర్నూలు రేంజ్ డీఐజీ ఆదేశాలతో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, అనుకోని ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తామని వెల్లడించారు.



సూచనలిస్తున్న డీఐజీ సీహెచ్ విజయరావు, ఎస్పీ రఘువీర్ రెడ్డి



సమావేశానికి హాజరైన నంద్యాల జిల్లా పోలీస్ అధికారులు

వెల్లుల్లి కిలో రూ.500

సామాన్యుల బెంబేలు



కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 27: వంటింట్లో అందరూ వాడే వెల్లుల్లి ధర విపరీతంగా పెరిగిపోతోంది. ఔషదాల తయారీలో కూడా వాడే వెల్లుల్లి సాగు ఈ సంవత్సరం వర్షాభావం వల్ల భారీగా పడిపోయింది. ప్రస్తుతం దీని ధర గతంతో పోలిస్తే వందశాతం పెరిగింది. రిటైల్‌గా కిలో రూ.500 పలుకుతోంది. ఇంత భారీగా పెరిగిన వెల్లుల్లి ఏం కొంటాం అని సామాన్య ప్రజలు అందున్నారు.

● సరఫరా తగ్గడంతో...

వెల్లులి దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లోకి సరఫరా కూడా పడిపోయింది. దీంతో ఇటీవల కొన్ని రోజుల్లోనే ధర అమాంతం పెరిగిపోయింది. రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.350 నుంచి రూ.500కు చేరుకుంది. కర్నూలు నగరంలోని పాతబస్టాండులో హోల్‌సేల్ మార్కెట్‌లోనే రూ.350 నుంచి రూ.400 పలుకుతోంది. నాణ్యమైన వెల్లుల్లి రూ.500 దాటిపోయిం ది. ఉత్తరాదిన అనూహ్య వర్షాల వల్ల, దక్షిణాదిన వర్షాభావం వల్ల వెల్లుల్లి దిగుబడి దెబ్బతిందని వారు స్పష్టం చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో మీచౌంగ్ తుఫాన్ కూడా వెల్లుల్లి పంటను నష్టపరిచింది. దీని వల్ల మార్కెట్‌లోకి వెల్లుల్లి సప్లయ్ తగ్గి ధరలు అమాంతం ఆకాశానికి ఎగబాకుతున్నాయి. సాధారణంగా ప్రతి సంవత్సరం చలికాలంలో వెల్లుల్లి ధరలు పెరుగుతాయి. కొత్త పంట మార్కెట్‌లోకి వచ్చేవరకు ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ధరలను అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వెల్లుల్లి ఎగుమతిపై నిషేధం విధించింది. దేశంలోనే అతి పెద్ద వెల్లుల్లి మార్కెట్‌లలో ఒకటైన గుజరాత్‌లోని జామ్‌నగర్, మండిలో సోమవారం కిలో వెల్లుల్లి టోకు ధర రూ.300-350కు చేరుకుందని స్థానిక వ్యాపారులు తెలిపారు.



గాజులదిన్నెలో 0.8 టీఎంసీలు

- ఎల్లెల్సీ నుంచి పన్నెండు రోజుల పాటు మళ్లింపు
- రోజుకు 239 క్యూసెక్కులు
- కర్నూలుకు రోజుకు 40 క్యూసెక్కులు విడుదల
- ఈ వేసవిలో తాగునీటి పథకాలకు కష్టమే
- ముందుస్తు వర్షాలపై అధికారుల ఆశలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 27: గాజులదిన్నె ప్రాజెక్టు కింది తాగునీటి పథకాలకు ఈ ఏడాది నీటి గండం రానుంది. ప్రస్తుతం జీడీపీలో 0.8టీఎంసీల నీరు మాత్రమే ఉంది. మంగళవారం నుంచి గోనెగండ్ల ఎల్లెల్సీ ఎస్కేప్ చానల్ నుంచి రోజుకు 239 క్యూసెక్కుల నీరు అధికారులు జీడీపీకి మళ్లిస్తున్నారు. మంగళవారం నుంచి ఎల్లెల్సీ ఎస్కేప్ చానల్ ద్వారా పన్నెండు రోజుల పాటు రోజుకు 239 క్యూసెక్కుల నీరు జీడీపీకి మళ్లిస్తున్నారు. ఎల్లెల్సీ నీరులేకపోతే వేసవిలో ప్రాజెక్టు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉండేది. దీంతో ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలు నీరు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడి డోన్, పత్తికొండ, కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాలకు తాగునీటి సమస్య తీవ్రమయ్యేది. అయితే ప్రస్తుతం నిలువ ఉన్ననీరు ఏప్రిల్, మే నెల వరకు తాగునీటి పథకాలకు సరిపోతాయని జూన్, జూలై నెలలో నీటి ఎద్దడి వచ్చే ప్రమాదం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనాలు వేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు కట్ట ఎత్తుపనులు జరుగుతుండటం దీనికి తోడు ఆరు క్రష్ గేట్లను మరమత్తు చేస్తుండటంతో ప్రాజెక్టులోని నీరు అంతా గత నాలుగు మాసాల క్రితమే కిందకు వదిలేశారు. ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టుకు వరద నీరు చేరలేదు. దీంతో ఈ వేసవిలో ప్రాజెక్టు కింద ఉన్న బండగట్టు(40 గ్రామాలకు తాగునీటి పథకం), డోన్, క్రిష్ణగిరి తాగునీటి పథకాలకు నీరు విడుదల చేయాల్సి ఉంది. కర్నూలు నగరంలో తాగునీటి సమస్య రావడంతో మంగళవారం నుంచి కర్నూలు నగరానికి రోజకు 40 క్యూసెక్కుల ప్రకారం జీడీపీ నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. అవసర సమయంలో కోడుమూరు, గూడురు, బెళగల్ తదితర ప్రాంతాలకు తాగునీటి విడుదల చేసేందుకు ఇబ్బందిగా మారుతుందన్న సమస్య గమనించిన ఇరిగేషన్ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా ఎల్లెల్సీ నీటిని ప్రాజెక్టులోకి మళ్లిసున్నారు. ఎల్లెల్సీ నీరు నిలువ చేసినప్పటికీ మే నెల చివరి వరకు సరిపోతాయా లేదా అనే అనుమానం అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జీడీపీలో 0.8 టీఎంసీల నీరు నిలువ వుంది. వేసవి తాపం వల్ల నిలువ వున్న నీటిలో సగం వరకు ఆవిరి రూపంలో ఖర్చవుతాయి. కాబట్టి ఇబ్బందులు తప్పవని అధికారులు అంటున్నారు. ఈ వేసవి గండం ఎలా తప్పుతుందా అని ఇరిగేషన్ అధికారులు అలోచిస్తున్నారు. ముందస్తు వర్షాలు వస్తే తాగునీటి పథకాలకు నీటి సమస్య రాకపోవచ్చునని అధికారులు అంటున్నారు.



గాజులదిన్నె ప్రాజెక్టులో నిలువ ఉన్న నీరు

239 క్యూసెక్కుల నీరు జీడీపీకి మళ్లింపు

గోనెగండ్ల సెక్షన్‌కు మంగళవారం నుంచి విడుదలైన 239 క్యూసెక్కుల నీటిని ఎస్కేప్ చానల్ ద్వారా గాజులదిన్నె ప్రాజెక్టు మళ్లిస్తున్నాము. మరో 12 రోజులపాటు నీరు విడుదల చేస్తారు. మిగిలిన రోజుల్లో విడుదల అయ్యే నీరు కేవలం తాగునీట పథకాలకు మాత్రమే. గోనెగండ్లలోని రెండు ఎస్ఎస్ ట్యాంకులు, కుంటలు, వాగులకు మాత్రమే ఈ నీటిని విడుదల చేస్తాం.

- ఉదయ్‌భాస్కర్ ఏఈ ఎల్లెల్సీ గోనెగండ్ల

నాణ్యంగా అభివృద్ధి పనులు

- వర్క్‌షాపులో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 27: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యంగా చేపట్టాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి సూచించారు. జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల సర్పంచులు, 422 మంది పంచాయతీ కార్యదర్శుల కు(గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు) మంగళవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో వర్క్‌షాపు ప్రారంభించారు. ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్, విజయవాడ అధ్వ ర్యంలో మార్చి 1 వరకు జరిగే ఈ వర్క్‌షాపులో గ్రామ పంచాయతీల్లో వస్తు వుల కొనుగోలు, వ్యాలిడిటీ తదితర ముఖ్యమైన అంశాలపై అవగాహన తరగ తులు ఉంటాయి. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిర్మాణాలు, కార్యాలయాల్లో, ఇళ్లలో వినియోగించే సిమెంట్, మెడికల్, వ్యవ సాయం, ఎలక్ట్రికల్ కేబుల్స్ పీవీసీ పైపులు, గ్యాస్ స్టవ్స్ తదితర పరికరాలు కొనుగోలు చేసే సమయంలో ఐఎస్ఐ మార్కు ఉన్నదా లేదా అని పరిశీలించా లని సూచించారు. నాణ్యత ప్రమాణాలతో ప్రతి వస్తువు కొనుగోలు చేసే విధంగా సర్పంచులు, కార్యదర్శులకు కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పర్యవేక్షకులు వెంకటరత్నం, డీఎల్‌పీఓలు తిమ్మక్క, నూర్జహాన్, శిక్షణ మేనేజర్ గిడ్డేష్, జూనియర్ అసిస్టెంట్ రాజావిష్ణువ ర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల జీవితాలతో వైసీపీ ఆటలు : ఎన్ఎస్ఎఫ్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 27: సీఎం జగన్ మోహన్ రెడ్డి హయాం లోని వైసీపీ నాయకులు క్రీడాకారుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి పోగు బజారన్న ఆరోపించారు. మంగళ వారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్ర రంజీ జట్టులో 17వ ఆటగాడిగా ఉన్న తిరుపతి వైసీపీ కార్పొరేటర్ కుమారుడి కోసం ప్రస్తుత కెప్టెన్ హనుమ విహారిని వేధించడం సిగ్గుచేటన్నారు. అత్యు త్తమ క్రీడాకారుడిగా పేరొందిన హనుమ విహారి వైసీపీ రాజకీయాలకు బల య్యాడన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ నిందితుడు శరత్‌చంద్రారెడ్డిని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమించినప్పుడే ఏసీఏ పరువు బంగాళాఖాతంలో కలిసిపోయిందన్నారు. వైసీపీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా హనుమవిహారికి క్షమాపణ చెప్పి తిరిగి కెప్టెన్సీని కేటాయించాలన్నారు.

జువెనైల్ హోం తనిఖీ

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 27: స్థానిక బీక్యాంపులోని జువెనైల్ హోమ్‌ను, మద్దూరు నగర్‌లోని వృద్ధాశ్రమంతో పాటు దిశ వన్‌స్టాప్ సెంటర్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు మంగ ళవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి అక్కడుంటున్న మహిళలు, బాల లకు వారి హక్కులు, బాధ్యతలతో పాటు వివిధ చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు.

శాశ్వత లోక్ అదాలత్ పై శిభిరం: ప్రజా దుర్వినియోగ సేవల కోసం శాశ్వత లోక్ అదాలత్ కృషి చేస్తుందని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్ తెలియజేశారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కోర్టు ఖర్చులు లేకుండా ఉచితంగా న్యాయాన్ని అందించడానికి శాశ్వత లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

బర్డ్ ఫ్లూపై అప్రమత్తత

రక్త నమూనాలు సేకరిస్తున్నామన్న పశుసంవర్ధకశాఖ జేడీ

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 27: నెల్లూరు జిల్లాలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో కోళ్ల ఫారాల్లో కోళ్లకు రక్తనమూనాల సేకరణ ప్రారంభించినట్లు పశుసంవర్ధకశాఖ జేడీ రామ చంద్రయ్య సోమవారం తెలిపారు. బర్డ్ ఫ్లూ వైరస్ ప్రమాదకరమైందని, కోళ్లు, బాతులు, ఇతర పక్షుల రక్తనమూనాలను సేకరించే కార్యక్రమాన్ని చేపట్టామ న్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి దాకా 40 రక్తనమూనాలు సేకరించడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 30 శాంపుల్స్ సేకరించామన్నారు. మిడ్తూరు మండలంలోని రోళ్లపాడు బట్టమేక పక్షి కేంద్రంలోని పక్షుల నుంచి 24 శాంపుల్స్ తీసినట్లు తెలి పారు. నంద్యాలలో బాతుల నుంచి, ఆలూరు, కర్నూలు రూరల్ మండలాల్లోని కోళ్ల ఫారాల్లో కోళ్ల నుంచి రక్తనమూనాలు సేకరించినట్లు జేడీ రామచంద్రయ్య తెలిపారు. ప్రస్తుతం నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాలోని రిజర్వాయర్ల వద్దకు వలసపక్షులు వచ్చేందుకు అవ కాశం ఉందని అన్నారు. వెలుగోడు, సుంకేసుల, గార్గేయపురం తదితర రిజర్వా యర్ల సమీపంలోని కోళ్ల ఫారాల్లో కోళ్లకు రక్తనమూనాలు సేకరించామని అన్నారు. బర్డ్ ఫ్లూ వైరస్ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కడా సోకినట్లు తమ దృష్టికి రాలేదని జేడీ రామచంద్రయ్య తెలిపారు.

ఆరుగురికి హెడ్ నర్సులుగా పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 27: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశా లలో ఆరుగురు స్టాఫ్ నర్సులు హెడ్ నర్సులుగా పదోన్నతి పొందారు. గత శుక్రవారం వైద్యఆరోగ్యశాఖ కడప రీజనల్ కార్యాలయంలో ఆర్‌డీ పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించారు. వీరిలో కర్నూలు జీజీహెచ్ నుంచి జి. విజయమ్మ, బి. ఎల్లమ్మ, కె. సిద్ధమ్మ, టి. నాగమణి, అనంతపురం నుంచి జి. విజయలక్ష్మి, సుశీలమ్మ ఉన్నారు. జి. విజయమ్మ, బి. ఎల్లమ్మ, జి. విజయలక్ష్మి కర్నూలు జీజీ హెచ్‌కు, కె. సిద్ధమ్మ, సుశీలమ్మ, టి. నాగమణి స్టేట్ క్యాన్సర్ యూనిట్‌కు పదో న్నతులతో పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 ఐ. వెంకటతులసమ్మ, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లు సావిత్రీబాయి నాగమణి, అనుసూయ, రాజ్యలక్ష్మి అభినందనలు తెలిపారు.

ఆదోని మార్కెట్లో ఎండు మిర్చి విక్రయాలు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 27: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఇకనుంచి వారంలో మూడు రోజులపాటు ఎండుమిర్చి క్రయవిక్రయాలు జరుగు తాయని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎండుమిర్చిని రైతులు విస్తారంగా సాగు చేశార న్నారు. పశ్చిమ ప్రాంత నియోజకవర్గంలో రైతుల విజ్ఞప్తి మేరకు ఆదోని మార్కెట్లో మూడు నెలలు కిందట ఎండుమిర్చి కొనుగోళ్లను ప్రారంభించామ న్నారు. గుంటూరు, బ్యాడిగి, కర్నూలు, ఎమ్మిగనూరు, స్థానికంగా వ్యాపారులు కలిసి టెండర్ విధానం ద్వారా మిర్చిని కొనుగోలు చేస్తున్నారన్నారు. రెండు రోజులే క్రయవిక్రయాలు ఉండేవని, రైతుల విజ్ఞప్తి మేరకు సోమవారం, బుధ వారం, శుక్రవారం వారాల్లో వారంలో మూడు రోజులపాటు ఎండుమిర్చి కొను గోలు జరుగుతాయని తెలిపారు. రైతులు ఇంటి వద్దనే గ్రేడింగ్ చేసుకొని తీసు కొస్తే మంచి ధర లభిస్తుందన్నారు. ఇతర మార్కెట్ కమిటీలకు వ్యయ ప్రయా సలు ఒర్చి వెళ్లి నష్టపోకుండా స్థానిక మార్కెట్ యార్డ్‌లోనే విక్రయించుకోవాలని సూచించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

రోడ్ సేఫ్టీ కమిటీలో డీఆర్వో ఆదేశం

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 27: రహదారుల్లో పెండింగ్‌లో ఉన్న పను లను త్వరితగతిన పూర్తి చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశిం చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని డీఆర్వో అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ రహదారుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పలూర్తి చేయడంతో పాటు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను డీఆర్వో ఆదేశించారు. ఎన్‌హెచ్-40 రహదారిలోని అండర్‌పాస్, జగనన్న హౌసింగ్ కాల నీకి సర్వీస్ రోడ్డు గురించి ఎన్‌హెచ్-40 అధికారులతో చర్చించారు. ఎన్‌హెచ్, రవాణా అధికారులతో కలిసి జాయింట్ సర్వే చేసి అండర్ పాస్ కల్పించడం కుదరదని అందుకు ప్రత్యామ్నాయ మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామ న్నారు. ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర ట్రాఫిక్ నియంత్రణ కోసం అండర్ పాస్ నిర్మా ణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, పంచాయితీరాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఆర్టీఓ రమేష్, డిప్యూటీ డెమో భాస్కర్, ఆర్టీసీ అధికారులు, మున్సి పల్ సిబ్బంది, నేషనల్ హైవే కర్నూలు, అనంతపురం జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

ఇదేమి కక్ష?

- కుటుంబ తగాదాలతో నకిలీ హాల్‌టికెట్ తయారీ
- గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షకు చిత్తూరు కేంద్రంగా..
- తీరా నకిలీ హాల్‌టికెట్ అని తెలిసి ఫిర్యాదు
- అసలు నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



మీడియా సమావేశంలో నిందితుడిని చూపిస్తున్న ఏఎస్పీ అరీఫుల్లా

చిత్తూరు/డోన్, ఫిబ్రవరి 27: వారిద్దరూ బంధువులే. కానీ, రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలున్నాయి. దీంతో గ్రూపు-2 ప్రిలి మినరీ స్ర్కీనింగ్ పరీక్షకు నకిలీ హాల్ టికెట్‌ను సృష్టించి ఇచ్చి.. పోలీ సులకు పట్టించాలని పథకం వన్నాడు. తీరా అతడే నిందితుడిగా దొరికిపోయాడు. కర్నూలు జిల్లాలో మొదలైన ఈ కుట్ర.. చిత్తూరులో బయటపడింది. ఈ వివరాలను మంగళవారం చిత్తూరు డీఎస్పీ రాజ గోపాల్‌రెడ్డి, ఒకటో పట్టణ సీఐ విశ్వనాథరెడ్డితో కలిసి ఏఎస్పీ అరీ ఫుల్లా మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. ఏపీపీ ఎస్సీ గ్రూపు-2 ప్రిలిమినరీ స్ర్కీనింగ్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించాలని నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని రాజా కాంప్లెక్స్‌లోని మీ సేవా కేంద్రంలో పనిచేస్తున్న బంధువైన ఇమ్మానుయేలును.. అదే జిల్లా క్రిష్ణగిరి మండలం కంబాలపాడుకు చెందిన సుదర్శనం కోరారు. గతంలో తమ రెండు కుటుంబాల మధ్య ఉన్న వైషమ్యా లను మనసులో పెట్టుకుని ఇమ్మానుయేలు దరఖాస్తు చేయకుండా మోసం చేయాలని నిర్ణయించుకున్నాడు. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. హాల్ టికెట్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసు కోవాలని అధికారులు ప్రకటించారు. ఆ మేరకు హాల్‌టికెట్ తీసివ్వా లని సుదర్శనం అడిగారు. అదే మీ సేవా కేంద్రంలో మండ్ల శ్రీనివా సులు అనే అభ్యర్థి ఒరిజనల్ హాల్ టికెట్ పీడీఎఫ్‌లో సేవ్ అయి ఉంది. ఆ ఒరిజనల్ హాల్ టికెట్‌ను పీడీఎఫ్ కన్వర్షన్ అప్లికేషన్ ద్వారా ఎంఎస్ వర్డ్ అప్లికేషన్‌లోకి మార్చి.. సుదర్శనం వ్యక్తిగత వివరాలు, ఫొటోను మండ్ల శ్రీనివాసులు హాల్ టికెట్‌లో ఎడిట్ చేసి నకిలీ హాల్ టికెట్‌ను ఇమ్మానుయేలు తయారు చేసిచ్చాడు. పరీక్షా కేంద్రాన్ని దూరంగా పెడితే వెళ్లడానికి సమయం చాలక.. పరీక్ష రాయకుండా వచ్చేస్తాడని అనుకున్నాడు. అందుకని చిత్తూరు నగరం మర్రిమాను వీధిలోని నారాయణ కాలేజీని పరీక్షా కేంద్రంగా నకిలీ హాల్‌టికెట్‌లో చూపించాడు. ఒకవేళ సకాలంలో పరీక్షకు వెళితే నకిలీ హాల్ టికెట్ కావడంతో పోలీసులకు పట్టుబడతాడని, అప్పుడు తన పంతం నెరవేరుతుందని ఇమ్మానుయేలు భావించాడు. ఈనెల 25వ తేదీన జరిగిన గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్షకోసం ఆ హాల్ టికెట్‌తో సుదర్శనం చిత్తూరుకు సకాలంలో చేరుకున్నారు. ఆ హాల్ టికెట్‌లో చూపిన నారాయణ కాలేజీని ప్రభుత్వం పరీక్షా కేంద్రంగా ఎంపిక చేయలేదు. దీంతో సుదర్శనం చిత్తూరులోని అధికారులను కలిసి హాల్ టికెట్‌ను చూపించారు. ఇది నకిలీదని అధికారులు గుర్తించారు. దీనిపై సుదర్శనం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు కర్నూలు జిల్లా డోన్‌లో ఉన్న ఇమ్మా నుయేలును అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న కంప్యూ టర్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విచారించారు. నేరం రుజువు కావడంతో మంగళవారం ఇమ్మానుయేలు(24)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అధికంగా కమీషన్ వసూలు చేస్తే చర్యలు

- కడప రీజియన్ పరిధిలో 78 శాతం సెస్సు వసూలు
- ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌ను తనిఖీ చేసిన ఆర్‌డీడీఎం



ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీడీఎం శ్రీకాంతరెడ్డి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 27: పంట ఉత్పత్తులను అమ్ముకునేం దుకు మార్కెట్ యార్డుకు వచ్చిన రైతుల నుంచి రెండు శాతం కన్నా అధికంగా కమీషన్ వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని మార్కెటింగ్ శాఖ కడప రీజియన్ డిప్యూటి డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. మార్కెట్ కమిటీలో జరుగుతున్న అవినీతి అక్ర మాలపై 'మార్కెట్ కమిటీ అవినీతి మయం..' శీర్షికన ఈనెల 23న ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. ఇందుకు స్పందించిన ఆర్‌డీ డీఎం శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం మార్కెట్ కమిటిని తనిఖీ చేశారు. స్థానిక కార్యదర్శి పద్మావతి, సిబ్బందితో కలిసి మార్కెట్‌ను, పండ్లు కూరగాయల మార్కెట్‌ను, క్యాంటిన్‌ను, రైతు విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. అనంతరం కార్యాలయలంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సిబ్బంది కూడా టెండరు పూర్తయిన వెంటనే వసూలు చేయాల్సిన కమీషన్‌ను మైకుద్వారా ప్రకటించాలన్నారు. బినామీ పేర్లపై చెలామణి అవుతున్న వ్యాపారులపై చర్యలు తీసు కుంటామన్నారు.

కడప రీజియన్ పరిధిలో రూ.95 కోట్లు సెస్సు వసూలు

మార్కెటింగ్ శాఖ కడప రీజన్ పరిదిలో వ్యవసాయ మార్కెట్ల ద్వారా రూ. 122 కోట్లు సెస్సు వసూలు లక్ష్యంగా పెట్టుకున్న ఆర్‌డీ డీఎం శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. జనవరి 31 నాటికి రూ.95 కోట్లు వసూలు చేశామన్నారు. ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటి టార్గెట్ రూ.4.50కోట్లు కాగా ఇప్పటివరకు రూ.5.25కోట్లు వసూలు చేయడం జరిగిందన్నారు.

వైసీపీ కక్ష సాధింపు చర్యలు

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌పై రౌడీషీట్!

పాత కేసులు తిరగతోడారు



కర్నూలు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల దగ్గర పడుతున్న కొద్ది అధికార వైసీపీ నాయకులు రాజకీయ కుట్రలకు తెర తీస్తున్నారు. టీడీపీ ద్వితీయశ్రేణీ, కీలక నాయకులను భయపెట్టి తమ వైపు తిప్పుకోడం.. కాదుకూడదంటే అక్రమ కేసులు పెట్టి బయటకు రాకుండా చేయడం వంటి ఎత్తులకు వేస్తున్నారు. అందులో భాగంగానే నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్లెల రాజశేఖర్‌పై ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే దీనిని పోలీసులు బయటకు రానివ్వకుండా తొక్కి పెట్టి.. ఎన్నికల ముందు మల్లెల రాజశేఖర్‌ను కట్టడి చేసేందుకే రౌడీషీట్ తెరిచారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన ఈడిగ(గౌడ) సామాజికవర్గానికి చెందిన మల్లెల రాజశేఖర్ మొదటి నుంచి టీడీపీ పాణ్యం నియోజవర్గం ఇన్‌చార్జి గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతుల ముఖ్య అనుచరుడిగా కొనసాగుతున్నారు. టీడీపీ ప్రభుత్వంలో కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేశారు. టీడీపీలో కీలకంగా రాణిస్తున్న మల్లెల రాజశేఖర్‌ను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా చేశారు. ఆ రోజు నుంచి పార్టీ బలోపేతం కోసం చురుగ్గా పని చేస్తున్నారు. ముఖ్యంగా పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గ్రామాల్లో కలియతిరుగుతూ బీసీ సామాజికవర్గంలో పార్టీ బలోపేతం చేయడం, వైసీపీ ముఖ్య నాయకులను టీడీపీలో చేర్పించుకోవడంతో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. ఇది వైసీపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం మింగుడు పడడం లేదు. టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత వర్గాన్ని బలహీన పరచాలనే కుట్రలో భాగంగానే రౌడీషీట్ ఓపెన్ చేశారని ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు.

ఐదేళ్లగా లేని కేసులు ఇప్పుడే కనిపించాయా..?

2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ అతిత్వరలో రానుంది. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గౌరు చరితకు చీఫ్ ఎన్నికల ఏజెంట్‌గా నియోజకవర్గంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. దీంతో ఆయనను కట్టడి చేయాలనే అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకే రౌడీషీట్ ఓపెన్ చేసి గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.

గత ఐగేళ్లగా పోలీసులకు కనిపించని కేసులు సరిగ్గా ఎన్నికలకు నెలరోజుల ముందు కనిపించడం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ ముఖ్య నాయకుల నుంచి ఆదేశాలు రాగానే పాత క్రైమ్ రికార్డులను పోలీసులు జల్లెడపట్టారు. మల్లెల రాజశేఖర్‌పై ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబరు.171/2013 యూ/ఎస్ 323, 506 ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ, సెక్షన్ 3(1)(ఎక్స్) ఏటపీ యాక్ట్, క్రైం నంబరు.217/2013 యూ/ఎస్ 107, సీఆర్.పీ.సీ, క్రైం నంబరు.53/2014 యూ/ఎస్ 110(ఈ) అండ్ (జీ) సీఆర్‌పీసీ, క్రైం నంబరు.69/2019 యూ/ఎస్ 294, 353,427 ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ, క్రైం నంబరు.118/2019 యూ/ఎస్ 323, 506 ఆర్/డబ్ల్యూ 34 ఏపీసీ అండ్ సెక్షన్ 3 (1)(ఆర్), క్రైం నంబరు.59/2021 యూ/ఎస్ 110 (ఈ) అండ్ (జీ) సీఆర్.పీ.సీ, క్రైం నంబరు.267/2021 యూ/ఎస్ 160 ఐపీసీ, క్రైం నంబరు.90/2022 యూ/ఎస్ 341, 285,290 ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ కింద 8 కేసులు ఉన్నట్లు లెక్క తేల్చారు. మూడు అంతకంటే ఎక్కువ కేసులు కలిగి ఉన్నాయనే సాకు చూపి ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నంబరు-460 ఓపెన్ చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. రాబోయే ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనకుండా రాజకీయంగా కట్టడి చేసేందుకే వైసీపీ నాయకుల ఒత్తిడితో రౌడీషీట్ ఓపెన్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా తన దృష్టికి రాలేదని పేర్కొనడం కొసమెరుపు. టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ వివరణ కోరగా తనపై ఓర్వకల్లు పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారనే సమాచారం వచ్చిందని, పూర్తి వివరాలు తెలుసుకొని న్యాయపోరాటం చేస్తానని పేర్కొన్నారు.

ముగిసిన ఎస్ఎల్, సిటీ స్కాన్ గడువు

- 1 నుంచి న్యూ డయోగ్నస్టిక్ బ్లాక్‌లో సిటీ సేవలు



మాట్లాడుతున్న ఆసపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 27: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశా లలోని ఎస్ఎల్ డయోగ్నస్టిక్ సెంటర్‌కు ఈ నెలాఖరుకు గడువు ముగియను న్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి తెలిపారు. మంగళ వారం కర్నూలు జీజీహెచ్ ధన్వంతరి హాలులో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్‌పై హెచ్ వోడీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్ డయోగ్నస్టిక్ సెంటర్ సిటీ స్కాన్‌కు సంబంధించిన గడువు అయిపోవడంతో మార్చి 1 నుంచి న్యూ డయో గ్నస్టిక్ బ్లాక్‌లో ఉన్న కొత్త సిటీ స్కాన్‌కు కేసులను పంపించాలని సూపరింటెం డెంట్ హెచ్‌ఓడీలను ఆదేశించారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 29 నాటికి ఎస్ఎల్ దయోగ్నస్టిక్‌కు గడువు ముగిసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఈహెచ్ఎస్ ఓపీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈహెచ్ఎస్ ఓపీల్లో ఖచ్చితంగా సంబంధిత విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన న్యూరాలజీ స్ట్రోక్ యూనిట్ (ఐసీయు)లో మెడి కల్ పీజీలను నియమించాలని హెచ్‌వోడీని ఆదేశించారు. డెత్ రిపోర్టులు ఆల స్యమవుతున్నాయని, త్వరగా పంపించాలని, డెత్ సమ్మరిలో అన్ని క్షుణ్ణంగా పరిశీలించాకే హెచ్‌వోడీలు సంతకం చేయాలని అన్నారు. ఈ సమీక్షలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరిం టెండెంట్ సి. ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంవో వెంకటే శ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శివ బాల పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంకు సీఈవోగా విజయ్‌కుమార్

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 27: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవోగా విజయకుమార్‌ను నియమిస్తూ ఆప్కాబ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం విజయకుమార్ విలేకరులతో మాట్లాడుతూ రైతులకు బ్యాంకు ద్వారా రుణాలను సకాలంలో అందించి ఆదుకునేందుకు కృషి చేస్తా మని అన్నారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహ రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీఈవోగా బాధ్యతలు చేపట్టిన విజయకుమార్‌ను బీఎం రామాంజనేయులు, ఇన్‌చార్జి సీఈవోగా బాధ్యతలు నిర్వహించిన శివలీల, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్, త్రినాథ్‌రెడ్డి, రాఘవేంద్ర తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినంద నలు తెలిపారు.

టీడీపీలో చేరిక



మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన యువకులు

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 27: టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో వైసీపీకి చెందిన నందికొట్కూరు పట్టణ యువకులు టీడీపీలో చేరారు. మంగళవారం అల్లూరులో మాండ్ర నివాసంలో టీడీపీ పట్టణ నాయకులు రసూల్, ఆరీఫ్ ఆధ్వర్యంలో చేరారు. మాండ్ర శివానందరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సంతోష్, ప్రవీణ్, రాఘవ, అఖిల్, కిశోర్ తదితరులు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నందికొట్కూరు: మృతి చెందిన మున్సిపల్ కార్మికుడి కుటుంబానికి టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో మున్సిపల్ కార్మికుడు భాస్కర్ మరణించారు. ఆయన భార్య, కుమారుడు టీడీపీ పట్టణ తెలుగు యువత నాయకుడు సతీష్‌ను మాండ్ర పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుండం రమణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, నందికొట్కూరు క్లస్టర్ ఇన్‌చార్జి ముర్తుజావలి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి షకీల్ అహ్మద్, పాల్గొన్నారు.

'జగన్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం'



49 బన్నూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు, ఫిబ్రవరి 27: అవినీతి పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. మిడుతూరు మండలంలోని 49 బన్నూరు గ్రామంలో మంగళవారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆ మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జయసూర్యతో పాటు నందికొట్కూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుండం రమణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జయసూర్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు లేక తమ పిల్లలు జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారన్నారు. లిక్కర్, మైనింగ్ మాఫియా ద్వారా సీఎం జగన్ వేల కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని, ప్రజలు చరమగీతం పాడడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని అన్నారు. అలాగే టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, రామకృష్ణుడు, శ్రీనివాసులు, రమేష్, సురేష్, జయన్న, రసూల్, మాబాషా, శివరాముడు, రంగస్వామి, రాఘవేంద్ర, హరీష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేపు కంబాలపల్లెలో ఉరుసు

పాములపాడు, ఫిబ్రవరి 27: మండలంలోని కంబాలపల్లె గ్రామంలో కసుమూరు హజరత్ సయ్యద్ కరీముల్లా షాఖాద్రి, కాలేషాపీర్, మస్తాన్‌వలి రహమతుల్లా 66వ గంధం, నిషాన్ ఉరుసు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు జనాబ్ షేక్ బాదుల్లా సాహెబ్ తెలిపారు. గురువారం గంధం, శుక్రవారం ఉరుసు, రాత్రి ఖవ్వాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యువకుడికి రిమాండ్

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 27: నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్పనా సెంటర్‌లో సోమవారం రాత్రి 7 గంటల సమయంలో బయటిపేటకు చెందిన మిద్దె రఘు అనే యువకుడు న్యూసెన్స్ చేస్తుండటంతో అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి. వెంకటచలపతి మంగళవారం తెలిపారు. నిందితుడు మద్యం తాగి స్థానికులకు, వాహనదారులకు ఆటంకం కలిగించడంతో పాటు మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అనంతరం నిందితుడిని నంద్యాల సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి ఎదుట హాజరుపరచగా అతడికి ఏడు రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. సీఐ మాట్లాడుతూ వన్‌టౌన్ సర్కిల్ పరిధిలో ప్రజాశాంతికి భంగం కలిగేలా ప్రవర్తిస్తూ, మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'అటవీ సంరక్షణ అందరి బాధ్యత'

పాణ్యం, ఫిబ్రవరి 27: అడవీ సంరక్షణ అందరి బాధ్యత అని అటవీ క్షేత్రాధికారి సుబ్బరాయుడు అన్నారు. అడవుల సంరక్షణలో భాగంగా మంగళవారం కొండజూటూరు, గోరుకల్లు గ్రామాలలో అడవుల సంరక్షణ అవగాహన కళాజాత నిర్వహించారు. అటవీ సమీపంలోని గ్రామాలైన కొండజూటూరు, గోరుకల్లు గ్రామాలలో కళాజాత నిర్వహించారు. డీఆర్వో చంద్రహాస్, బీట్ అధికారులు జమాల్‌వలి, అబ్దుల్‌కలాం, మహేష్, సర్పంచ్ సుజీత్‌రెడ్డి హుసేన్‌బాషా, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి

నందికొట్కూరు, ఫిబ్రవరి 27: చంద్రశేఖర్ ఆజాద్ 93వ వర్ధంతి సందర్భంగా స్థానిక నందికొట్కూరు పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా నాయకుడు రఘురామ్మూర్తి, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు నాగేశ్వర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం చంద్రశేఖర్ ఆజాద్ ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. మున్సిపల్ కార్మికుల వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 27: ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణాలతో టీడీపీ నాయకుడు కురువ కిట్టన్న మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆ కుటుంబానికి మంగళవారం పది వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కరివేన గ్రామ టీడీపీ నాయకులు శివశంకరశర్మ, పరశురామ్‌యాదవ్, ఈశ్వరయ్య టీడీపీ నాయకులు కురువ కిట్టన్న భార్య వెంకటలక్ష్మమ్మను పరామర్శించి ఈ ఆర్థిక చేయూతను అందజేశారు.

'నిరుద్యోగులను మోసగించిన వైసీపీ ప్రభుత్వం'



ప్రజా పోరు యాత్రలో పాల్గొన్న అభిరుచి మధు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 27: నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా వైసీపీ ప్రభుత్వం మోసగించిందని బీజేపీ నంద్యాల కన్వీనర్ అభిరుచి మధు ఆరోపించారు. పట్టణంలోని మసీదు సెంటర్, వీసీ కాలనీ, పెద్దచర్చి, ఎంఎస్‌నగర్, మూలసాగరం, గౌసియా నగర్ ప్రాంతాల్లో ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. అభిరుచి మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవరత్నాలకు చిల్లులు పడ్డాయన్నారు. పట్టణంలో దోమల నివారణ చేయలేని అసమర్థ ఎమ్మెల్యే శిల్పా అని ధ్వజమెత్తారు. సుధాకర్, హసీనా, చెన్నమ్మ, ఉపేంద్ర, చంద్ర శేఖర్, బసవరాజు, స్వాతి, బలరాం, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డు దిగ్బంధం

- నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్నామని
- 10 బొల్లవరం గ్రామస్థుల ఆందోళన



కేజీ రోడ్డును దిగ్బంధించిన 10 బొల్లవరం గ్రామస్థులు

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 27: తాగునీటి కోసం కేజీ రహదారిపై పెద్ద సంఖ్యలో గ్రామస్థులు బిందెలతో కేజీ రహదారిని దిగ్బంధించారు. నందికొట్కూరు మండలంలోని 10 బొల్లవరం గ్రామంలోని బీసీ కాలనీవాసులు తాగునీటి కోసం మంగళవారం కేజీ రహదారిపై ధర్నా చేస్తూ రోడ్డును దిగ్బంధించారు. మహిళలు మాట్లాడుతూ గ్రామంలో బీసీ కాలనీలో నీరు రాక 30 రోజులు కావస్తోందని చెప్పారు. ఎన్నో సార్లు చెప్పినా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని వాపోయారు. బీసీ కాలనీలో దాదాపుగా 200 దాకా గృహాలు ఉన్నాయని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు రోడ్డుపై బైఠాయించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో బ్రాహ్మణకొట్కూరు పోలీసులు వచ్చి సర్ది చెబుతూ అధికారులను పిలిపించి తాగు నీరు అందేలా చూస్తామని తెలపడంతో బీసీ కాలనీవాసులు శాంతించారు. బొల్లవరం గ్రామ పంచాయతీ కార్యదరి నూరుల్లా మాట్లాడుతూ గ్రామం నుంచి కాలనీకి తాగు నీరు సరఫరా చేసే బోరు మరమ్మతుకు గురి కావడంతో సమస్యల తలెత్తిందని చెప్పారు. బోరు మరమ్మతు చేయించి తాగు నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

కలుషిత నీటితో తీవ్ర అస్వస్థత

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- బాధితులను పరామర్శించిన టీడీపీ నాయకులు
- అధికారులపై బాధితులు, ప్రజల అసహనం



వైద్యులతో మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 27: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో నూనెపల్లె మంచినీళ్ల బావి సమీపంలోని మారుతీనగర్‌లో కలుషిత నీటి ప్రభావంతో పదిమంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఐదు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మారుతీనగర్‌లో మంచినీటి పైపులైన్ సిమెంట్ రోడ్డు కింద ఉండటం, పైపులైన్ పగిలిపోవడంతో సీసీ రోడ్డు పక్కనే ఉన్న మురుగు కాలువలోని నీరు మంచినీటి పైపులైన్‌లోకి వెళ్లడంతో కలుషితం అయినట్లు అధికారులు గుర్తించారు. అస్వస్థతకు గురైన పది మందిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అస్వస్థతకు గురికావడం, వారిలో ఇద్దరు గత ఐదు రోజులుగా ప్రైవేటు ఆసుపత్రిలో ఐసీయూలో ఉండి చికిత్స పొందుతున్న విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితులను టీడీపీ నాయకులు పరామర్శించడానికి వెళ్లారని తెలియగానే అప్పటికప్పుడు కాలనీలో బ్లీచింగ్ పౌడర్‌ను మున్సిపల్ సిబ్బంది చల్లారు. వైద్య సిబ్బంది కాలనీలోని ఇంటింటికి వెళ్లి పరీక్షలు నిర్వహించారు. కలుషిత నీటి విషయంపై మున్సిపల్ మంచినీటి సరఫరా విభాగం అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లా డుతూ మంచినీటి పైపులైన్‌లోకి మురుగునీరు చేరిన విషయం తెలియగానే చర్యలు చేపట్టామని తెలిపారు. మంచినీటి శాంపిల్‌ను పరీక్షలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో ఇద్దరు, ప్రైవేటు ఆసుపత్రిలో ఇద్దరు చికిత్స పొందుతున్నారని, మిగతా 6 మంది డిశ్చార్జి అయినట్లు తెలిపారు.



కలుషిత నీటికి కారణమైన పైపులైన్

ప్రజల అసహనం

మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, నీటి సరఫరా విభాగం అధికారి శ్రీనివాసరెడ్డి సమక్షంలో వైద్య సిబ్బంది ఇచ్చిన సలహాలు ఇచ్చారు. అయితే బాధిత కుటుంబ సభ్యులు, ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యులు ఐదు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటే ఇప్పుడొచ్చి సలహాలు ఇవ్వడం ఏమిటని వాపోయారు. ఇప్పటికే రూ.1.20 లక్షలు చెల్లించామని, ఇంకా డబ్బులు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఇందుకు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు.

టీడీపీ నాయకుల పరామర్శ

ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నూనెపల్లె మారుతీనగర్‌కు చెందిన రామకృష్ణ, నాగేంద్ర, తదితరులను టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు వాకా శివశంకరయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు మునగాల విశ్వనాథ్‌రెడ్డి, అయ్యలూరు త్రిలింగేశ్వరరెడ్డి తదితరులు పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ఆత్మకూరులో వైసీపీకి భారీ షాక్..!

- మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో టీడీపీలోకి చేరికలు



బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 27: ఆత్మకూరు పట్టణంలో ఐదు చోట్ల వైసీపీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. 12వ వార్డులో ఉమ్మర్ అలి, షఫీవుల్లా ఆధ్వర్యంలో మోమిన్ అలిషేర్, షేక్ రఫీ, ఫైజుల్లా, షేక్షావలి, జనివుల్లా, యాకూబ్‌తో పాటు మరో 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. 20వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు గఫార్, వాజీద్, మజీద్, షఫీవుల్లా, సైపుల్లా, కలీముల్లా, ముర్తుజా, రాముడు, వెంకటేష్‌తో పాటు మరో 50 కుటుంబాలు, 11వ వార్డులో రిటైర్డు ఆర్టీసీ డ్రైవర్ అల్లబకాష్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు, 10వ వార్డుకు చెందిన గౌండ మున్నా ఆధ్వర్యంలో 50కుటుంబాలు, 19వ వార్డులోని గరీబ్‌నగర్‌కు చెందిన కార్పెంటర్ జిలానీ, షేక్ ఇస్మాయిల్, రెహంతుల్లా, ముర్తుజా, మేదరి వెంకటేశ్వర్లు, సుధాకర్ ఆధ్వర్యంలో మరో 30కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. బుడ్డా మాట్లాడుతూ మాట్లాడుతూ రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఆత్మకూరు పట్టణాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తామని, ప్రత్యేకించి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. నాయకులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, నాగూర్‌ఖాన్, అబ్దుల్లాపురం బాషా, బోధనం మల్లేశ్వరరెడ్డి, రామ్మూర్తి, సుబ్బయ్య, అమ్మల్లా, న్యామత్, దగ్గుపాటి శ్రీనివాసులు, నబిరసూల్, మల్లికార్జునరెడ్డి, రాజారెడ్డి, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

'కొత్త వంగడాలను పరిచయం చేయాలి'



మాట్లాడుతున్న ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 27: వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి విడుదలయ్యే కొత్త వంగడాలను క్షేత్ర స్థాయిలో రైతులకు పరిచయం చేయాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లు వ్యవసాయ శాఖ అధికారులకు, పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు, సిబ్బందికి సూచించారు. మంగళవారం జిల్లా ఏరువాక కేంద్రంలో, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఏడీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, సమన్వయకర్త డాక్టర్ ఎస్ సరళమ్మ, శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ రామకృష్ణారావు, డాక్టర్ ఎస్ బాలాజీ నాయక్, తదితరులు హాజరయ్యారు. గత ఏడాది చేపట్టిన ప్రదర్శనా క్షేత్రాలు, విస్తరణ ఫలితాలను రైతులకు, జిల్లా అధికారులకు వివరించారు. గుంటూరు నుంచి వచ్చిన వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ విశాలాక్షి మాట్లాడుతూ ఏరువాక శాస్త్రవేత్తలు వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయంతో రైతు భరోసా కేంద్రాల సహకారంతో ఏరువాక సేవలను జిల్లాలోని రైతులందరికీ వర్తింపజేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పరిశోధనలు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి నాగరాజు మాట్లాడుతూ మిరప, ఉల్లిలో కలుపు నివారణపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా నాబార్డు అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా ప్రణాళిక రచిస్తే ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. వ్యవసాయ శాఖ, అధికారులు, అభ్యుదయ రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాల సమర్పణ



ఆలయ ఈవోకు పట్టువస్త్రాలను అందచేస్తున్న భక్తులు

మహానంది, ఫిబ్రవరి 27: మహానంది క్షేత్రంలో మార్చి 6 నుండి జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఉపయోగించే పట్టు వస్త్రాలను హైదరాబాద్‌కు చెందిన వారణాశి రామ్మోహన్‌రావు, విజయలక్ష్మి దంపతులు ఆలయ ఈవో కాపుచంద్రశేఖర్‌రెడ్డికి అందచేసారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలకు స్వామి, అమ్మవార్లకు ఉపయోగించే పట్టు వస్త్రాలను దాతలు సంప్రదాయం ప్రకారం అందచేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈఏడాది కూడా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అందచేసినట్లు ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని తెలిపారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

మహానంది, ఫిబ్రవరి 27: మహానంది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను మంగళవారం విజయవాడలోని కార్యాలయంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టుసత్యనారాయణకు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి అందచేశారు. గొల్లపూడిలోని దేవదాయశాఖ కమిషనర్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణను ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, జనార్ధన్‌శర్మ ఆశీర్వదించి, ప్రసాదాలు, బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను అందచేశారు. వీరితో పాటు దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్లు చంద్రమోహన్ కుమార్, చంద్రశేఖర్ ఆజాద్‌ను ఆహ్వాన పత్రికలను అందచేశారు.

రేపు కర్నూలులో 'దివ్యాంగుల సింహగర్జన'



కరపత్రాలను విడుదల చేస్తున్న దివ్యాంగులు

గడివేముల, ఫిబ్రవరి 27: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని గురువారం కర్నూలు ఎస్టీబీసీ కళాశాలలో జరిగే సింహగర్జనకు భారీగా తరలి రావాలని దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో సింహగర్జన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రంగస్వామి, శ్రీనివాసులు, సామన్న, వహిదా, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

'జయప్రదం చేయండి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 27: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మార్చి 3న బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగే సింహగర్జన సభను జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లె ఎలీషా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సోదరభావంతో కలిసి ఉన్న మాలలు, మాదిగలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ పేరుతో వీడదీయాలని ప్రయత్నించడం సరికాదన్నారు. రాష్ట్రంలో అత్యధిక ఓటు బ్యాంకు ఉన్న మాలలకు అన్యాయం జరిగేలా చేస్తే రాబోయే ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జయపాల్, మిద్దె చెన్నయ్య, శీలయ్య, రవికుమార్, చింతయ్య రమేష్, మాజీ సర్పంచ్ పెద్ద బిచ్చలు, సురేష్ తదితరులు ఉన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

శ్రీశైలం, ఫిబ్రవరి 27: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకల్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు, అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతిస్వామికి పూజలు చేశారు.

వైభవంగా శివపార్వతుల గ్రామోత్సవం

- అలరించిన దేవతామూర్తుల వేషధారణ



గ్రామోత్సవంలో కొలువుతీరిన ఉత్సవమూర్తులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 27: మహాశివరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలో శివపార్వతుల గ్రామోత్సవాన్ని వైభవంగా ప్రతిఏటా మహాశివరాత్రిని పురస్కరించుకుని శివదీక్షామాలాధారణ స్వీకరించిన శివభక్తులు గ్రామోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి ఆత్మకూరు శివార్లలోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి సిద్ధేశ్వర స్వామి ఆలయం వరకు గ్రామోత్సవం కొనసాగింది. పలువురు శివస్వాములు పరమేశ్వర, పార్వతి, ఆంజనేయ, గణపతి, మణికంఠ, రాక్షస, నారద, పరుశురామ తదితర వేషధారణలు ఆకట్టుకున్నాయి. శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సెక్టోరల్ అధికారులు కీలక పాత్ర పోషించాలి: జేసీ



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 27: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమైనదని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణపై సెక్టోరల్ అధికారులు, పోలీసు అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్ల సంఖ్యను బట్టి మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవాలన్నారు. పోలింగ్ రోజు మ్యాక్ పోల్ నిర్వహణ, ఈవీఎం, వీవీ ప్యాడ్ల పనితీరు, ఏచిన్న సంఘటన జరిగినా ఆర్ఓకు ఫిర్యాదు తదితర అంశాలపై పూర్తి స్థాయి శిక్షణ పొంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. గత ఎన్నికల్లో రీపోలింగ్ జరిగిన పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించి పకడ్బందీగా వల్నరబిలిటీ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేసి, రిటర్నింగ్ అధికారికి నివేదిక ఇవ్వాలని జేసీ సూచించారు.

చాపిరేవుల చెక్‌పోస్టు తనిఖీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 27: నంద్యాల మండలం చాపిరేవుల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ విధినిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని డబ్బు, మద్యం, ఇతర నిషేధిత వస్తువులు అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు. ఇందుకుగాను ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ జేవీ సంతోష్ ఉన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్ 2024

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 27: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాలలోని గురురాజా స్కూల్‌లో మంగళవారం సైన్స్ ఎక్స్‌పో 2024 ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎంఈవో బ్రహ్మం, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ, గురురాఘవేంద్రా విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, లయన్స్ క్లబ్ నంద్యాల శాఖ ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారతరత్న సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైన్స్, సోషియల్ విభాగాలలో 300 ప్రాజెక్టులు విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను అతిథులు పరిశీలించి అభినందించారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 27: సీపీఎస్, జీపీఎస్‌లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయు లకు ఇచ్చిన సీపీఎస్‌ను రద్దు చేయకుండా దాని స్థానంలో జీపీఎస్‌ను ప్రవేశపెట్టడం దౌర్భాగ్యమని అన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవ స్వామి, సాంబశివుడు మాట్లాడుతూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి క్యాంపు ఆఫీసులో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో జరిగే సమావేశంలోనైనా 28 డిమాండ్లపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలన్నారు. పుల్లయ్య, మునిస్వామి, రవి, పవన్‌కుమార్, వెంకటేశ్వర్లు, గోపాల్‌రావు, పాల్గొన్నారు.

'రైతులకు న్యాయం చేయాలి'

పాణ్యం, ఫిబ్రవరి 27: పాణ్యం మండలంలోని సోలార్ పరిశ్రమలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కందికాయపల్లెలోని రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాణ్యం మండలంలో సోలార్, పవన విద్యుత్, పునరుత్పాదక విద్యుత్ పేరుతో వేల ఎకరాల పేద రైతుల భూములు తీసుకుంటూ నామమాత్రపు ఖరీదు కట్టి ఆభూముల నుంచి రైతులను దౌర్జన్యంగా వెళ్లగొడుతున్నారన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో నష్టపోయిన రైతులు పాల్గొని వ్యక్తిగత అర్జీలు అందించాలని కోరారు. జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సుబ్బరాయుడు, సీఐటీయూ నాయకులు భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

నందికొట్కూరు, ఫిబ్రవరి 27: మున్సిపల్ కమిష నర్లను బదిలీచేస్తూ మున్సిపల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా సుధాకర్‌రెడ్డిని నియమించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కిషోర్ అనంతపురం జిల్లా రాయదుర్గానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి'

గోస్పాడు, ఫిబ్రవరి 27: మండలంలోని అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి హరినాథ్ కోరారు. మంగళవారం గోస్పాడులో మాట్లాడుతూ చాలా గ్రామాలలో వైసీపీ నాయకులు తమ అనుచరులకే ఇళ్ల స్థలాలు ఇచ్చారని, వారికి అవసరం లేకపోయినా ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో అక్కడ ఇళ్లు నిర్మించుకోలేదని అన్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : మాజీ మంత్రి



ప్రజలతో మాట్లాడుతున్న అఖిలప్రియ

నంద్యాల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని దొమ్మర కాలనీ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పట్టణంలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు దౌర్జన్యాలు చేసి డబ్బులు లాక్కుంటున్నారని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకపోతే ఓట్లు వేయాలని బెదిరిస్తున్నారన్నారు. మురుగు కాలువల పేరుతో వ్యాపారుల స్థలాల్లో మట్టి తవ్వి అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ప్రజల్లో టీడీపీకి ఆదరణ పెరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుసేన్‌బాషా, శేఖర్‌రెడ్డి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

యువతను వంచించిన వైసీపీ ప్రభుత్వం

కోట్ల రాఘవేంద్రరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

డోన్, ఫిబ్రవరి 27: ప్రతి యేటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చి యువతను వంచించిందని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు, టీడీపీ యువ నాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, కోట్రికే ఫణిరాజ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మద్దయ్యగౌడు, లక్ష్మీనారాయణ, డోన్, ప్యాపిలి మండలాల అధ్యక్షులు శ్రీనివాసులు, రామసుబ్బయ్య, సుధీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోట్ల రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ డోన్ పట్టణానికి మార్చి 1న టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌తో పాటు జనసేన నాయకులు వస్తున్నారని తెలిపారు. టీడీపీ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురుస్వామి యాదవ్, కిరణ్ యాదవ్, వెంకట్రాముడు, మాజీ సర్పంచ్ శ్రీరాములు, జయరాముడు, వలసల బాలుడు, పెద్దయ్య, లారీల బాషా, రంగన్న, రజినీ యాదవ్ పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి



చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 27: స్వాతంత్ర సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ 93వ వర్ధంతి సభను ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పాణ్యం సిమెంటు నగర్ జూనియర్ కళాశాలలో స్వాతంత్ర పోరాట యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉదయ్ మాట్లాడుతూ భారత దేశం బానిసత్వ నుంచి విముక్తి పొందాలని చంద్రశేఖర్ ఆజాద్ సాయుధ పోరాటం చేసి అమరుడయ్యాడని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ప్రదీప్ నంద, విశ్వనాథ్ విజయ్, రహిమతుల్లా, కిరణ్, ఇద్రూస్, రంజిత్, కార్తీక్, కేశవ, హరి, అనిల్ పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 27: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని టీడీపీ నాయకులు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, లాయర్ అల్లీహుసేన్ అన్నారు. మంగళవారం వారు విలేఖర్లతో మాట్లాడుతూ ఒక్క చాన్సు పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. గత ఎన్నికల్లో తాను అధికారంలోకి వస్తే మద్యపానం దశల వారీగా పూర్తిగా నిషేధిస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. నాసిరకం మద్యం రాష్ట్రంలో విక్రయించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడు తున్నారని విమర్శించారు. జగన్ విద్యుత్, బస్‌చార్జీలు, నిత్యావసరాలు, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచారన్నారు. రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా ఉన్నా వాటిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. 2024 ఎన్నికల్లో వైసీ పీకి పతనం తప్పదన్నారు.

నేడు కోవెలకుంట్లకు బీసీ దంపతుల రాక

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 27: పట్టణంలోని పేరా రామసుబ్బారెడ్డి కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించే టైలర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు హాజరవుతున్నట్లు న్యూ టైలర్స్ సంఘం అధ్యక్షుడు అహమ్మద్‌హుసేన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ న్యూ టైలర్స్ సంఘం ఏర్పడినప్పటి నుంచి ప్రతి ఏడాది బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో పేద టైలర్లకు కుట్టుమిషన్లు, ఆర్థిక సాయం అందిస్తు న్నారని తెలిపారు.

రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చారు : జనసేన

డోన్(రూరల్), ఫిబ్రవరి 27: రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం అప్పుల మయంగా మార్చిందని డోన్ నియోజకవర్గ జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం డోన్ జనసేన పార్టీ కార్యాలయంలో జనసైనికులతో డోన్ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలుపు కోసం జనసైనికులు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అనంతరం కర్నూలు జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి చింతల సురేష్‌ను కలిసి భవిష్యత్తులో చేపట్టే జనసేన కార్యక్రమాల గురించి వివరించారు. పరదేశి మహేష్ ఉన్నారు.

'పోలియో నిర్మూలనకు కృషి చేద్దాం'

రుద్రవరం, ఫిబ్రవరి 27: ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, పోలియో నిర్మూలనకు కృషి చేద్దామని వైద్యాధికారి అమర్‌నాథ‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వైద్య సిబ్బందితో పీహెచ్‌సీ ఆవరణలో సమీక్ష నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాల స్వామికి పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 27: రుద్రవరం సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం అర్చకులు నిత్య తృప్తదాస్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గీతాపారాయణం చేపట్టారు.

గ్రామ దేవతలకు.. చిన్నకంబలూరు, యల్లావత్తుల, కొండమాయపల్లె, రుద్రవరం గ్రామాల్లో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజాస్వామ్యాన్ని వైసీపీ ఖూనీ చేసింది

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి



బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని వైసీపీ ప్రభుత్వం ఖూనీ చేసిందని బనగానపల్లె శాసనసభ్యుడు బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల లోని టీడీపీ కార్యాలయంలో విలేఖర్ల సమావేశం మండల టీడీపీ కన్వీనర్ మూలే రామేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం గుండాయిజం, దౌర్జన్యంతో రాక్షస పాలన కొనసాగిస్తున్నదని విమర్శించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలపై అన్ని వర్గాల ప్రజలపై దౌర్జన్యం, కక్ష సాధింపు చర్యలతో వైసీపీ పాలన కొనసాగిస్తున్నదని అన్నారు. తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని సీఎం వైఎస్ జగన్ ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. సొంత బాబాయిని హత్య చేసిన వారిని సీఎం వెనుకేసుకురావడం దారుణమన్నారు. రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, గ్రామాల్లో పారిశుద్యం, సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ పథకాలను 2024లో అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మూలే రామేశ్వరరెడ్డి, మండల ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, బనగానపల్లె కో కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి, నంద్యాల నారాయణరెడ్డి, మూలేహుసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీకి కొలిమిగుండ్లలో భారీ షాక్

జడ్పీ చైర్మన్ బంధువులు టీడీపీలో చేరిక

బనగానపల్లె నియోజవకర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి నాయకత్వానికి మద్దతుగా వైసీపీ నుంచి వలసలు పెరిగాయి. కొలిమిగుండ్ల మండలంలో మంగళవారం సుమారు 60 కుటుంబాలకు పైగా టీడీపీలో చేరారు. కొలిమిగుండ్లలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి వర్గానికి చెందిన నాగిరెడ్డి సైతం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కొలిమిగుండ్ల పట్టణం నుంచి, ఎస్సీ కాలనీ నుంచి పలువురు వైసీపీ నాయకులు బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. వీరికి బీసీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గూడూరు నాగేశ్వరరెడ్డి, గూడూరు నాగేశ్వారెడ్డి, నాగార్జునరెడ్డి, సూర్యచంద్రారెడ్డి, శివరామిరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, గూలి రామచంద్రారెడ్డి, గూలి జయరామిరెడ్డి, సిద్ధమఠం రాంభూపాల్‌రెడ్డి, హర్షవర్దన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితర 30 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బీసీ సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే దాసరి పెద్ద దస్తగిరి, దాసరి బాలుడు, దాసరి నడిపిదస్తగిరి, దాసరి పుల్లయ్య, నారాయణస్వామి, దాసరి హరి, దాసరి రాజేశ్, దాసరి విష్ణువర్దన్ తదితరులు తమ కుటుంబాలతో కలసి టీడీపీలో చేరారు. అలాగే కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీకి చెందిన బుగ్గరాముడు, శివయ్య, ఓబులేసు, బాంద్రా వాసు, పేతూరు బాలయ్య మొదలైన మరో 10 కుటుంబాలవారు టీడీపీలో చేరారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



పుచ్చకాయలపల్లెలో బండలాగుతున్న ఎద్దులు

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 27: మండలంలోని పుచ్చకాయలపల్లె గ్రామంలో రంగనాయకు లస్వామి జీర్ణోద్ధరణ ఉత్సవంలో భాగంగా ఆదివారం నిర్వహించిన పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మొత్తం 8 జతల ఎద్దులు పాల్గొనగా వీటిలో కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం చౌటుపల్లె గ్రామానికి చెందిన హనుమంతు, కోడూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన ఎద్ల జత మొదటి సాధించాయి. దీంతో రూ.30 వేలు నగదు బహుమతిని యజమానులకు అందించారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం వీఆర్ పల్లె గ్రామానికి చెందిన రంగనాయకులు ఎద్దులు రెండో స్థానంలో రాణించగా రూ.20వేలు, రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి చెందిన సూర్యదినకర్ ఎద్దులు చేత మూడోస్థానంలో రాణించడంతో రూ.15 వేలు నగదును యజమానులకు అందజేశారు. చాగలమర్రి మండలానికి చెందిన దాదాపీర్ ఎద్ల జత నాలుగోస్థానంలో రాణించగా రూ.10వేలు, ఆళ్లగడ్డ మండలం మర్రిపల్లె గ్రామానికి చెందిన కృతిక్ ఎద్ల జత 5వ స్థానంలో రాణించడంతో రూ.5వేలు నగదును యజమానులకు అందజేశారు. బహుమతులను కమిటీ సభ్యులు మార్తల పెద్దపుల్లారెడ్డి, అక్కంపల్లె గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి, కాకరవాడ గ్రామనికి చెందిన పార్థసారధిరెడ్డి, నాగిరెడ్డి అందించారు.

చంద్రబాబును కలిసిన తెలుగు యువత నాయకుడు



చంద్రబాబుతో రమేష్‌నాయుడు

దొర్నిపాడు, ఫిబ్రవరి 27: మండలంలోని భాగ్యనగరం గ్రామానికి చెందిన తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి తాళ్లూరి రమేష్‌నాయుడు టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు.

ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్సులో డోన్ విద్యార్థికి చోటు



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం

డోన్(రూరల్), ఫిబ్రవరి 27: ఏసియా బుక్ ఆఫ్ ద రికార్డ్స్‌లో డోన్ పట్టణం సాంజో స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి కొండెపోగు జోనాథన్ స్థానం దక్కింది. హైదరాబాదులోని సెయింట్ థామస్ కేథగ్రాల్ చర్చిలో ఏర్పాటు చేసిన ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఈవెంట్‌లో హల్లేట్ మ్యూజిక్ స్కూల్ విజయవాడ వ్యవస్థాపకుడు ఆగస్టీన్ దండింగి వారి నేతృత్వంలో 300 గంటల పాటు ఎలక్ట్రానిక్ కీబోర్డు వాయిస్తూ పాటలు పాడటంతో ఏసీయా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం దక్కింది. ఈసందర్భంగా విద్యార్థిని సాంజో స్కూల్ హెచ్ఎం మిస్సెస్ నిషా ఫిలిప్ అభినందించారు.

'అరాచక పాలనకు అంతం తప్పదు'

చాగలమర్రి, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని కుమ్మరి వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. వైసీపీ అరాచక పాలనకు ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పశుపోషణపై అవగాహన కల్పించాలి

సంజామల, ఫిబ్రవరి 27: పశుపోషణపై రైతులకు అవగాహన కల్పించా లని పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య పశువైద్య సిబ్బందిని సూచించారు. మంగళవారం మండలంలోని అల్వ కొండ గ్రామంలో జరిగిన పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో జేడీ మోహన్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశుబీమా, పశువులకు సోకే వ్యాధులను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు ఆయన వివరించారు. అనంతరం సంజామల ఏరి యా పశువైద్యశాలలో కొలిమిగుండ్ల, సంజామల మండలాల వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు రమేష్, రఘుబాలక్రిష్ణ, శివానంద్ రెడ్డి, పద్మావతి పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి: పీడీ

రుద్రవరం, ఫిబ్రవరి 27: జిల్లాలో గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రామకృష్ణ సూచించారు. రుద్రవరంలో మంగళవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లే అవుట్లలో గృహాల నిర్మాణం చేపట్టే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. మొదలు పెట్టిన గృహాలను వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ హరిగోపాల్, ఏఈ నాగరాజు, వర్క్ ఇన్‌స్పెక్టరు ఆనంద్ పాల్గొన్నారు.

నేడు హరినగరంలో పార్వేట పల్లకి



పూజలు చేస్తున్న ప్రాజెక్టు మేనేజరు చంద్రకేశవ దాస్

రుద్రవరం, ఫిబ్రవరి 27: అహోబిల లక్ష్మీనరసింహస్వామి పార్వేట పల్లకి విడిది నేపథ్యంలో చివరి మజిలీలో ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశామని హరినగరం, అహోబిలం ఇస్కాన్ టెంపుల్ ప్రాజెక్టు మేనేజర్ చంద్రకేశవ దాస్ తెలిపారు. మండలంలోని హరినగరం, అహోబిలం ఇస్కాన్ టెంపుల్‌లో మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరువేల మంది భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేశామని చెప్పారు. రష్యన్ దేశం నుంచి ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో 50 మంది భక్తులు వస్తారని చెప్పారు. నెల్లూరు నుంచి సాంస్కృతిక బృందం కూచిపూడి, భరతనాట్యం ఏర్పాటు చేశామన్నారు. ఇస్కాన్ దేవాలయాన్ని విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

సైకో పాలనకు ముగింపు పలుకుదాం: కోట్ల



కోట్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న కనపకుంట్ల టీడీపీ నాయకులు

డోన్, ఫిబ్రవరి 27: రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్న సైకో జగన్ పాలనకు ముగింపు పలుకుదామని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలులోని కోట్ల నివాసంలో కనపకుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దేవేందర్ రెడ్డి, లక్ష్మన్న, నారాయణరెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కోట్లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలేబాదు తండా గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు సాలమ్మ తోపాటు పలువురు కార్యకర్తలు కోట్లను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ విధ్వంస పాలన సాగిస్తూ రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. కరెంటు, గ్యాస్, బస్సు చార్జీలు, డీజిల్, పెట్రోల్ ధరలు ఇష్టారాజ్యంగా పెంచేసి ప్రజల జేబులను వైసీపీ ప్రభుత్వం గుల్ల చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మర్రి రమణ, సీనియర్ న్యాయవాది భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తల నిర్ణయమే అంతిమం: సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

బేతంచెర్ల, ఫిబ్రవరి 27: డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల డోన్, ప్యాపిలి మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తల నిర్ణయమే తమ అంతిమం అని పార్టీ సీనియర్ నాయకుడు ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి అధ్యక్షతన నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు తాను డోన్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేశానని అన్నారు. అయితే పార్టీ అధినేత చంద్రబాబు ఏ కారణాల చేత తనకు టికెట్ కేటాయించలేకపోయారో ఇప్పటికీ తెలియజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల నిర్ణయం మేరకే తన అంతిమ నిర్ణయం ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, మండల ఉపాధ్యక్షుడు రామనాథం తదితరులు పాల్గొన్నారు.

రిజర్వు పోలీసు సిబ్బంది విడిది భవనం తనిఖీ



రిజర్వు పోలీసు విడిది భవనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలో సెంట్రల్ రిజర్వు విడిది చేసే భవనాన్ని నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పట్టణంలోని సాయి పబ్లిక్ స్కూల్ భవనంలో 150 మంది పోలీసు బలగాలు విడిది చేయనుండటంతో వారికి మంచి నీరు, విద్యుత్ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం కోటకందుకూరులోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. డీఎస్పీ షర్ఫుద్దీన్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, పట్టణ సీఐ రమేష్‌బాబు, రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐలు నగినా, నరసింహులు ఉన్నారు.

సమస్త జీవులకు నీరే ప్రాణాధారం



విద్యార్థినికి పుస్తకాలు పంపిణీ చేస్తున్న బ్రహ్మానందచారి

బనగానపల్లె, ఫిబ్రవరి 27: సమస్త జీవులకు నీరే ప్రాణాధారం అని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందచారి అన్నారు. మంగళవారం జిల్లెళ్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలో మనం పౌండేషన్ అధ్యక్షుడు చక్రవర్తి సహకారంతో విద్యార్థులకు నోటుపుస్తకాలు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. బ్రహ్మానందాచారి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని, విద్యార్థులు వేసవిలో మంచినీరు అధికంగా తాగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్‌రావు, ఉపాధ్యాయురాలు బసవనాగమ్మ పాల్గొన్నారు.

'వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 27: పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో అనూరాధ సూచించారు. చాగలమర్రి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. పది విద్యార్థినుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థినులను తీర్చిదిద్దాలన్నారు. ప్రిన్సిపాల్ సునీత, సీఆర్పీ అమీర్‌ఖాన్ ఉన్నారు.

శివస్వాములకు అన్నదానం

బేతంచెర్ల, ఫిబ్రవరి 27: సమాజంలో హిందూ ముస్లిం మతాలకు అతీతంగా మత సామరస్య వేదిక ఆధ్వర్యంలో 41 రోజుల పాటు మండల దీక్ష స్వీకరించిన శివస్వాములకు భిక్షా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని దుర్గాపేటలో ఉన్న సిద్ధేశ్వర స్వామి ఆలయంలో మతసామరస్య వేదిక అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, నూర్ అహ్మద్, గౌస్ సభ్యులు శివస్వాములకు భిక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు.

గర్భిణి ఆత్మహత్య

నంద్యాల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని బాచేపల్లె గ్రామానికి చెందిన మనోహర్ భార్య, నిండు గర్భిణీ నాగసులోచన(20) సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలివీ.. దొర్నిపాడు గ్రామానికి చెందిన నాగసులోచనకు ఏడాది క్రితం బాచేపల్లెకు చెందిన మనోహర్‌తో వివాహమైంది. అయితే ఇంట్లో సోమవారం రాత్రి ఉరివేసుకున్నారు. తన కూతురు ఆరోగ్యం సరిగా లేక చీరకొంగుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 27: కలుగొట్ల నుంచి గుండుబాపలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో మంగళవారం ఆటో ఎద్దుల బండి ఢీకొనడంతో ఇరువురికి గాయాలైనట్లు రేవనూరు ఎస్ఐ రామమోహన్‌రరెడ్డి తెలిపారు. అనకల లింగమయ్య, ప్రసాద్‌తోపాటు మరికొంత మంది కలుగొట్ల గ్రామంలో మిరప పొలంలో పనులు ముగించుకొని వల్లంపాడు గ్రామానికి చెందిన ఖాదర్‌వలి ఆటోలో వెళ్తుండగా రేవనూరు సమీపంలో ఎద్దుల బండిని ఢీకొ నడంతో లింగమయ్య, ప్రసాద్‌లకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా పవిత్రోత్సవం

చాగలమర్రి, ఫిబ్రవరి 27: మండలంలోని డి.వనిపెంటలో ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో వేద పండితుడు, శివస్వాముల ఆధ్వర్యంలో మాఘమాసం సందర్భంగా పవిత్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

క్రికెట్ విజేతలకు నగదు బహుమతి ప్రదానం



విజేతలకు నగదు, షీల్డులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, ఫిబ్రవరి 27: చాగలమర్రి గ్రామంలోని గుంతపాలెం వీధిలో ఏర్పాటు చేసిన ఫోర్‌లైన్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం టీడీపీ నాయకులు కొలిమి షరీఫ్, అజిముద్దీన్, అష్రఫ్, షబ్బీర్, ఉసేన్‌పీరా, ఇర్షాద్, వశీమ్, గౌస్ నగదు, షీల్డ్‌ను అందజేశారు. మొదటి స్థానం షాహిద్ జట్టు గెలుపొందడంతో రూ.20 వేలు, రెండో స్థానంలో ఇమామ్ జట్టుకు రూ.10 వేలు, మూడవ స్థానంలో రియాజ్ జట్టుకు రూ.7 వేలు, నాలుగో స్థానంలో మక్బూల్ జట్టుకు రూ.4 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో పీడీ దాదాపీర్, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమిసోను, కొలిమి మహబూబ్‌బాషా, కొలిమి సున్ని, నాగూర్‌వలి, నిర్వాహకులు ఇంతియాజ్, సర్ఫరాజ్, ఉసేన్‌వలి పాల్గొన్నారు.

'యువత సరైన నిర్ణయం తీసుకోవాలి'



బోయలకుంట్లలో అవగాహన కల్పిస్తున్న ఏపీ వారియర్స్ టీం సభ్యులు

శిరివెళ్ల, ఫిబ్రవరి 27: రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు వచ్చే ఎన్నికల్లో యువత సరైన నిర్ణయం తీసుకోవాలని ఏపీ వారియర్స్ టీం సభ్యులు కమతం రాజశేఖర్‌రెడ్డి, ఉల్లి వెంకట సుబ్బయ్య అన్నారు. 'ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోయలకుంట్ల, మహదేవపురం, చెన్నూరు, ఇసుకపల్లె, కొట్టాలపల్లె, కోటపాడు, గుండంపాడు, మోత్కులపల్లె, గోవిందపల్లె గ్రామాల్లో పర్యటించి గ్రామ పెద్దలు, బూత్ ఇన్‌చార్జిలు, యువతకు మంగళవారం అవగాహన కల్పించారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్న పత్రాలు

నంద్యాల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పబ్లిక్ పరీక్ష ప్రశ్న పత్రాలు ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్‌కు మంగళవారం చేరాయి. ఆళ్లగడ్డ పట్టణంలో ప్రభుత్వ వైపీపీఎం, ప్రజ్ఞ, కేవీఎస్ఆర్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా ఇంటర్‌బోర్డు అధికారులు గుర్తించారు. ఈ కేంద్రాలలో సుమారు 1286 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

డోన్(రూరల్), ఫిబ్రవరి 27: పట్టణంలోని గాంధీ నగర్ 1వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ జయరాం మంగళవారం పరిశీలించారు. అనంతరం సచివాలయ పరిధిలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, వార్డు సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

లక్ష్మీ నారసింహుడికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 27: రుద్రవరంలో పార్వేట ఉత్సవ పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనసింహస్వామి, ప్రహ్లాద వరదస్వాములకు అటవీ అధికారులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. తెలుపుపై కొలువుదీరిన ఉత్సవ మూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో రేంజర్ శ్రీపతినాయుడు, సెక్షన్ ఆఫీసరు నాగరాజు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు. రుద్రవరంలో పార్వేట ఉత్సవ పల్లకీ సందర్భంగా మంగళవారం యాచకులకు అన్నదానం చేశారు.